సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 21 । నవంబర్ । 2023



రూ.1,40,661 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కల్లూరి భాస్కర పల్లయ్య శర్మ (హైదరాబాద్) సోమవారం రూ.1,40,661 విరాళం సమర్పించారు.



తొలి వారం.. భక్తజన సాగరం

పవిత్ర కార్తికం.. అందునా కైలాసనాథుడైన ఆ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం.. అది కూడా ఈ మాసంలో మొట్టమొదటిది కావడంతో శివాలయాలు భక్తజన సాగరాలే అయ్యాయి. 8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

వచ్చే జనవరిలో గోదావరి బాలోత్సవం

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, ఎస్పీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్ తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గోదావరి రెండో బాలోత్సవాన్ని (పిల్లల పండుగ) ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎస్పీ జగదీష్ జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఇతర అధికారులతో కలిసి బాలోత్సవ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 27 ,28 తేదీల్లో జరిగే రెండో బాలోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. బాలోత్సవ కమిటీ నిర్వాహకురాలు తులసి మాట్లాడుతూ ఈసారి రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం మండలంతో పాటు రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లోని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులంతా ఈ వేడుకలో పాల్గొనవచ్చన్నారు. కల్చరల్, అకాడమిక్ విభాగాల్లో 32 అంశాల్లో 60 పోటీలను నిర్వహిస్తామన్నారు. పి. మురళీకృష్ణ, డి. సాయిబాబా, అద్దంకి రాజయోనా, పడాల రామకృష్ణ, కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



కె.ప్రవీణ్ కుమార్



పి.ఆకాంక్ష



జి.జయదుర్గ

రాజమహేంద్రవరం రూరల్: భగవాన్ శ్రీ సత్య సాయిబాబా జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విద్యా విభాగం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటారు. రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీకళాశాల బీఎస్సీ విద్యార్థి కె.ప్రవీణ్‌కుమార్, కోనసీమ జిల్లా లక్కవరంలోని మంగెన గుర్రయ్య జూనియర్ కళాశాల విద్యార్థిని పి.ఆకాంక్ష, కాకినాడ జిల్లా జగపతినగరంలోని సీవీ.రామన్ కళాశాల విద్యార్థిని జి.జయదుర్గ వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచారు. మంగళవారం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో జరిగే వేడుకల్లో వీరికి బంగారు పతకాన్ని, సర్టిఫికెట్లు అందజేస్తారని మూడు జిల్లాల అధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, యార్లగడ్డ గోవిందరాజులు, బులుసు వెంకటేశ్వర్లు తెలిపారు.

భక్తులతో రత్నగిరి కిటకిట

తాత్కాలికంగా ముత్తంగి సేవ నిలుపుదల



సత్యదేవుని ఆలయం వద్ద భక్తుల రద్దీ

అన్నవరం: కార్తిక సోమవారం,శుద్ధ అష్టమి పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సా యంత్రం వరకు భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. 4,750 వరకూ స్వామివారి వ్రతాలు జరిగాయి. 40 మంది భక్తులు స్వామివారి నిత్య కల్యాణంలో రూ.1,116 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సుమా రు పది వేల మంది భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ తట్టుకునేందుకు తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు రత్నగిరిపై రూ.200 టిక్కెట్‌పై ప్రత్యేక దర్శనం, రూ.300 టిక్కెట్ మీద ప్రదక్షిణ దర్శనం నిలిపివేశారు. ఉచిత దర్శనం మాత్రమే కొనసాగించారు. దిగువన యంత్రాలయంలో కూడా లోపలకు ఎవరినీ అనుమతించలేదు. ఉదయం 11 గంటల తరువాత రూ.200 దర్శనానికి భక్తులను అనుమతించారు.ముత్తంగి సేవ నిర్వహించలేదు. ప్రతీ సోమవారం ముత్తంగి సేవ, గురువారం నిజరూపదర్శనం నిర్వహించాలని దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులిచ్చిన విషయం విదితమే. భక్తుల రద్దీ కారణంగా ఈ సేవను తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులు ఆదేశించినట్లు అర్చకులు తెలిపారు. సోమవా రం తెల్లవారుజామున శివునికి అభిషేకం చేసిన తరువాత ఎప్పటి లాగానే సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరులకు పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సాగు నీటి బెంగ లేనట్టే..



- జిల్లాలో వైఎస్సార్ జలకళ' సాకారం
- సాగునీటి కష్టాలకు చెక్ పెట్టేలా చర్యలు
- ఉచితంగా బోర్ల తవ్వకం, మోటార్ల అందజేత
- చిన్న, సన్నకారు, పెద్ద రైతులకు ప్రయోజనం
- సత్ఫలితాలిస్తుండటంతో కర్షకుల్లో ఆనందం

జిల్లాలో జలకళ కింద బోర్ల పురోగతి ఇలా..

నియోజకవర్గం	అనుమతి పొందినవి	డ్రిల్లింగ్ చేసినవి	అనుమతి రావాల్సినవి	చేయాల్సినవి
గోపాలపురం	268	158	110	20
కొవ్వూరు	87	83	4	58
నిడదవోలు	287	267	20	24
అనపర్తి	525	291	234	168
గోకవరం	401	153	248	17
రాజమండ్రి రూరల్	9	9	0	1
రాజానగరం	367	174	193	27

సాక్షి, రాజమహేంద్రవరం: వ్యవసాయం పండగ కావాలంటే పొలాలకు సాగునీటి లభ్యతే కీలకం. అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న నీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టింది. ఖరీఫ్, రబీలో గోదావరి జలాలు అందిస్తూ కర్షకులకు అండగా నిలుస్తోంది. అంతటితో ఆగకుండా 'వైఎస్సార్ జలకళ'లో భాగంగా భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న రైతుల పొలాల్లో ఉచితంగా బోరు వేసి భరోసా ఇస్తోంది. ఉచితంగా మోటార్లు సైతం అందజేస్తోంది. రైతులకు అండగా నిలవాలన్న తలంపుతో ప్రారంభించిన పథకం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అమలవుతోంది. జిల్లా వ్యాప్తంగా పథకం సత్ఫలితాలనిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అర్హుల గుర్తింపు నుంచి బోర్ల డ్రిల్లింగ్ వరకు ప్రక్రియ వేగవంతంగా సాగుతుండటంతో పంటసాగుకు నీటి బెంగ దూరమవుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో బోర్లు అవసరమైన రైతుల నుంచి డ్వామా అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. దీనికి విశేష స్పందన లభించింది. వాటిని డ్వామా (జిల్లా నీటి యాజమాన్య సంస్థ) ఏపీడీ లాగిన్‌కు పంపారు. ఏపీడీ జియాలజిస్టుల సర్వే కోసం పంపారు. దరఖాస్తులను వడపోసిన అధికారులు 1979 దరఖాస్తులు అర్హతగా గుర్తించి అంచనాలు రూపొందించారు. వాటిలో 1944కు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1135 బోర్లు డ్రిల్లింగ్ చేశారు. ఇంకా 809 బోర్లు తవ్వాల్సి (వేయాల్సి) ఉంది. 432 బోర్లకు విద్యుత్ కనెక్షన్ సైతం సమకూర్చారు. 412 మోటార్లకు అంచనాలు రూపొందించారు. 315 మోటార్లకు పరిపాలనా అనుమతులు ఇవ్వగా.. 69 మోటార్లను ఉచితంగా రైతులకు అందజేశారు.

మార్గదర్శకాలు ఇలా..

- తొలుత రెండెకరాల లోపు మెట్ట, రెండున్నర ఎకరాల లోపు మాగాణి ఉన్న చిన్న, సన్నకారు రైతులకే బోర్లు వేయాలని నిర్ణయం తీసుకున్నారు.
- తాజాగా భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న ప్రతి రైతు పొలంలో ఉచితంగా బోరు వేసి సాగునీటికి భరోసా కల్పించాలని పథకంలో మార్పులు చేశారు.
- చిన్న, సన్నకారు రైతులకు మాత్రం బోరుతో పాటు ఉచితంగా మోటారు కూడా అందజేయనున్నారు. 5 ఎకరాలు పైన ఉన్న రైతులకు కేవం బోర్లు మాత్రమే వేస్తారు.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..

- బోరు అవసరమైన రైతులు ముందుగా సచివాలయంలో వలంటీర్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్వో దరఖాస్తును పరిశీలించి, డ్వామా అధికారులకు పంపుతారు.
- ఆ దరఖాస్తు మేరకు హైడ్రో జియోలాజికల్ జియో ఫిజికల్ సర్వే ద్వారా రైతు భూమిలో ఎక్కడ బోరు వేసేది శాస్త్రీయంగా నిర్ణయిస్తారు.
- తర్వాత బోరు వేస్తారు. ఒక వేళ బోరు వేసిన చోట నీరు పడక ఫెయిలైతే మరో చోట గుర్తించి బోరు వేస్తారు.
- జియోలాజికల్ సర్వేకు కూడా ప్రభుత్వమే ఖర్చు భరిస్తుంది. బోరు ఉన్న భూమిలో మాత్రం బోరు వేయరు.
- రైతు భూమిలో బోరు ఉండి మరమ్మతులకు గురైతే అక్కడ మరో బోరు వేసేందుకు వీలుంటుంది. ఎంత మేర బోరు తవ్వకాలు చేస్తే ఆ మేరకు కేసింగ్ పైపు కూడా ఉచితంగానే ఇస్తారు.



కొవ్వూరు డివిజన్ పరిధిలో బోర్ల డ్రిల్లింగ్ అనంతరం పైప్‌లైన్ అమర్చుతున్న రైతులు, అధికారులు

గతంలో అధ్వానం

గతంలో చిన్న, సన్నకారు రైతులు బోర్లు వేసుకునేందుకు ఏటా రూ.లక్షల్లో వ్యయం చేసేవారు. బోరు తవ్వించాలంటే రెవెన్యూ, భూగర్భ జలశాఖ అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. ఆ ప్రయత్నాల్లో రైతులు ఆపసోపాలు పడేవారు. రూ.వేలకు వేలు డబ్బులు ఖర్చు పెట్టినా నీళ్లు పడతాయో లేదో అనే భయంతో వెనకడుగు వేసేవారు. కొన్ని చోట్ల సాగునీటికి బోర్లు వేసుకుని అప్పులపాలు అయ్యేవారు. బోర్లు వేసుకోవాలనే ఆలోచన ఉన్నా.. నీళ్లు పడుతాయో లేదో? అన్న ఆందోళన నెలకొనేది. పైగా జియాలిజిస్టులకు డబ్బులు కట్టాలన్న భయంలో మిన్నకుండిపోయేవారు. ప్రస్తుతం ప్రభుత్వ చర్యలతో అలాంటి అవస్థలకు అడ్డుకట్ట పడింది. వెరసి చిన్న, సన్నకారు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రక్రియ వేగవంతం

డ్వామా ఏపీడీ నుంచి అందిన దరఖాస్తులకు సంబంధించిన సర్వే త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంలో కాంట్రాక్టర్లు జియాలజిస్టులతో సర్వే ప్రక్రియ వేగవంతం చేశారు. బోరుకు రూ.70 నుంచి రూ.లక్ష వరకు ఖర్చు కానుంది.

మరింత మంది రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం జలకళ పథకంలో నిబంధనలను సరళీకృతం చేసింది. విస్తీర్ణంతో సంబంధం లేకుండా వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడేనని తేల్చిచెప్పింది. సన్న, చిన్నకారు రైతులతో పాటు మధ్యతరగతి, పెద్ద రైతులకు సైతం లబ్ధి చేకూర్చనుంది.



రైతులకు ఎంతో ప్రయోజనం



రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తోంది. ఇది నిరంతర ప్రక్రియ. అర్హులైన రైతులకు ఇప్పటికే బోర్లు వేసే ప్రక్రియ ప్రారంభించాం. 80 శాతం లక్ష్యాలను సైతం అధిగమించాం. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన రైతులు గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. అందిన దరఖాస్తులను వెంటనే జియాలజిస్టులకు పంపి నిర్ధారించుకుంటున్నాం. బోర్ల డ్రిల్లింగ్, మోటార్ల పంపిణీ ప్రక్రియ వేగవంతంగా చేపడుతున్నాం. – పి.జగదాంబ, డ్వామా పీడీ

కుల గణనపై టీడీపీకి కలవరమెందుకు

ఎంపీ మార్గాని భరత్ రామ్



విలేకరుల సమావేశంలోఎంపీ మార్గానిభరత్ రామ్,చిత్రంలో డా.గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం రూరల్: కుల గణనపై ప్రతిపక్ష పార్టీలు ఎందుకు కలవర పడుతున్నాయో అర్థం కావడం లేదని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని తమ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలో'జన గణన చేపట్టిన సమయంలోనే కులగణన కూడా చేపడితే సామాన్యులకు, పేదలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆయా కులాల జనాభాకు దామాషా ప్రకారం రాజకీయ, సామాజిక, ఆర్థిక ఫలాలు అందజేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతంగా తీసుకున్న కుల గణన నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో ఉప కులాలతో సహా నిర్వహించి వివరాలను ప్రజల ముందుంచుతామన్నారు. ఈ నిర్ణయం వల్ల టీడీపీకి వచ్చిన నష్టమేమిటో తెలియడం లేదన్నారు. ఆ పార్టీ హయాంలో ఇటువంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోలేకపోయిందన్నారు. వివిధ పథకాల కింద లబ్ధిదారులకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిలో కనీసం 25 శాతమైనా ఇచ్చినట్లు టీడీపీ చెప్పగలదా అని ప్రశ్నించారు. కార్యకర్తలు, నాయకులు వాటాలు పంచుకోవడం, దోచుకు తినడం తప్పిస్తే మరొకటి లేదన్నారు. ఇసుకపై పురందేశ్వరి చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ ఇసుక వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.4,500 కోట్లకు పైనే వచ్చిందన్నారు. టీడీపీ హయాంలో ఇన్ని వేల కోట్లు ఎవరి ఖజానాలోకి పోయాయో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కులాలపై మాట్లాడే పేటెంట్ హక్కు సీఎం జగన్‌కే..

ఏ కులం గురించైనా మాట్లాడే పేటెంట్ హక్కు సీఎం జగన్‌మోహన్ రెడ్డికే ఉందని, మరే ప్రతిపక్ష నేతలకు లేదని ఎంపీ అన్నారు. ఉందని ప్రతిపక్షాలు అంటే.. బహిరంగంగా చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో కులాలను ఓట్ల బ్యాంకుగా వాడుకోవడం తప్పిస్తే ఆయా వర్గాల సంక్షేమానికి పని చేశారా అని ప్రశ్నించారు. 'జయహో బీసీ' అంటూ టీడీపీ రాజకీయ స్వార్థాన్ని చాటుతోందన్నారు. పల్లకీ మోసే బోయిలుగానే చూశారు తప్పిస్తే..రాజకీయంగా ఏనాడైనా చట్ట సభలకు పంపడానికి చూశారా అని ప్రశ్నించారు. కనీసం రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మాదిరిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీట్లు కేటాయించగలరా అని టీడీపీ నాయకులకు ఎంపీ సవాల్ విసిరారు. రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీరాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, రాష్ట్రశెట్టిబలిజ,గౌడ,ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలికశ్రీను, రాష్ట్రయువజన విభాగ కార్యదర్శి గుర్రం గౌతమ్,జీవకారుణ్యసంఘం చైర్మన్ బర్రేకొండబాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా గోదావరి హారతి

- హరినామ సంకీర్తనలతో మార్మోగిన గోష్పాద క్షేత్రం
- హాజరైన హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్, టీటీడీ బోర్డు మెంబర్ వెంకట సుబ్బరాజు
- తిలకించి పులకించిన భక్తజనం



గోష్పాదక్షేత్రంలో గోదావరి నదీమాతకు హారతి సమర్పిస్తున్న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ విశేషాధికారి ఆనంద తీర్థాచార్యులు చిత్రంలో టీటీడీ పండితులు,హోం మంత్రి తానేటి వనిత తదితరులు

కొవ్వూరు: హరి నామ సంకీర్తనలతో కొవ్వూరు గోష్పాద క్షేత్రం మార్మోగింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కన్నుల పండువగా ఈ క్షేత్రంలో గోదావరి హారతి నిర్వహించారు. గోదావరి నదిపై పంటుపై సుందరంగా అలంకరించిన వేదికపై తిరుపతి నుంచి తీసుకు వచ్చిన వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో తొలుత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ విశేషాధికారి పీఆర్ ఆనంద తీర్థాచార్యులు తన ప్రసంగంలో గోష్పాద క్షేత్రం విశిష్టత, గోదావరి నది పవిత్రతను వివరించారు. కార్తిక మాసంలో దీపారాధన ఎంతో పుణ్యప్రదం అన్నారు. కార్తిక మాసం విశిష్టతకు భక్తులకు వివరించారు. గోదావరి నది పవిత్రతను చాటి చెప్పేందుకే 2010 నుంచి ఏటా టీటీడీ ఆధ్వర్యంలో నీరాజనం సమర్పిస్తున్నామన్నారు.

నదీమ తల్లితోనే సస్యశ్యామలం

హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ పవిత్ర కార్తిక మాసంలో ఇంతటి ఆధ్యాత్మిక కార్యక్రమంలో తాను భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు. గోదావరి జలాలతో గోదావరి జిల్లాలు సస్యశ్యామలంగా మారాయన్నారు. నదీమ తల్లి కారణంగా నీటి వసతి సమకూరడంతో ఈ ప్రాంతం వాసులు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని మంత్రి అన్నారు. సమృద్ధిగా సాగు, ప్రజలకు తాగునీరు అందిస్తూ ఈ ప్రాంతాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దిన గోదావరి నది పవిత్రతను ఈ ప్రాంత వాసులందరూ కాపాడుకోవాలన్నారు. ప్రజలందరికీ మంత్రి వనిత కార్తిక మాస శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీటీడీ నుంచి వచ్చిన వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య గోదావరి నదికి వివిధ రకాలైన హారతులు సమర్పించారు. నదీమ తల్లికి చీర, పసుపు, కుంకుమలు సమర్పించారు. రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యుడు మార్గాని భరత్‌రామ్, టీటీడీ పాలకమండలి సభ్యుడు గాదిరాజు వెంకట సుబ్బరాజు, కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, అవంతి ఇండస్ట్రీస్ డైరెక్టర్ అల్లూరి కావ్య, పండితుడు దోర్బల ప్రభాకరశర్మ, పలువురు రాజకీయ, ఆధ్యాత్మిక ప్రముఖులు, వేలాదిగా భక్తులు హాజరయ్యారు.

స్పందనలో అర్జీలకు తక్షణమే పరిష్కారం

కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్ తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రజల అర్జీలను సత్వర పరిష్కరించాలని కలెక్టర్ మాధవీ లత అధికారులను ఆదేశించారు. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ఎస్పీ జగదీష్, జేసీ తేజ్ భరత్‌లతో కలిసి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ స్పందనలో 192 అర్జీలు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. అర్జీలను 24 గంటల్లో ఓపెన్ చేసి కాల పరిమితి లోగా పరిష్కరించాన్నారు. రెవెన్యూ, పంచాయతీ శాఖలకు చెందిన 6 అర్జీలను కాలపరిమితి లోగా పరిష్కరించలేదన్నారు. మాదక ద్రవ్యాలు, మద్యం, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అటువంటి వారిపై, వారిని ప్రోత్సహించే వారిపై పీడీ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసు శాఖ పరిధికి చెందిన 40 అర్జీలను స్వీకరించామన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలోవిద్యార్థులు పాల్గొనాలి

కులగణన, ఆడుదాం ఆంధ్రా, భారత్ సంకల్ప యాత్రకు సంబంధించి ఈనెల 23లోగా క్షేత్ర స్థాయిలో శిక్షణ తరగతులు పూర్తి చెయ్యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌తో కలిసి ఆమె మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ఆడుదాం ఆంధ్రా క్రీడలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనేలా చూడాలన్నారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను పంపించామన్నారు. కులగణన సర్వే ప్రక్రియపై క్షేత్ర స్థాయి సిబ్బందికి, అధికారులకు రెండు రోజుల్లో మ్యాపింగ్ పూర్తి చేసి, తదుపరి శిక్షణ తరగతులను పూర్తి చేయాలన్నారు. భారత్ సంకల్ప్ యాత్రపై మంగళవారం రాజమహేంద్రవరంలో శిక్షణ నిర్వహించనున్నామని తెలిపారు. ఖరీఫ్‌లో కోతలు పూర్తి చేసిన చోట ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగునీటి లభ్యతపై ఎలాంటి సందేహాలు పెట్టుకోరాదని ఆమె రైతులకు స్పష్టం చేశారు.

అభివృద్ధి పథంలో జిల్లా అడుగులు

రాజమహేంద్రవరం సిటీ: అభివృద్ధి కేంద్రంగా మారిన జిల్లా పారిశ్రామికంగా, పర్యాటకంగా, వ్యవసాయ అనుబంధ రంగాల పరంగా తనదైన ముద్ర వేసుకుంటున్నట్లు కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. విశాఖపట్నం గ్రోత్ హబ్, ర్యాపిడ్ ఆర్థికాభివృద్ధి విధానంలో సమీప జిల్లాల ప్రభావంపై నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా ప్రత్యేక గుర్తింపు కలిగిన రాజమహేంద్రవరం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. జిల్లాలో రూ.6786.65 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన 37 భారీ, మెగా పరిశ్రమల ద్వారా 17,453 మంది పొందుతున్నారన్నారు. రూ.1925.71 కోట్ల పెట్టుబడితో ఇప్పటివరకు 16,056 సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా యూనిట్లు ఏర్పాటయ్యాయన్నారు. తద్వారా 44,054 మందికి ఉపాధికి కల్పించామన్నారు. గోదావరిలో లభ్యమయ్యే ఇసుక విశిష్టత కలిగి ఉందన్నారు. ఈ భూములు సారవంతమైనవన్నారు. అభివృద్ధికి ఆస్కారమున్న వివిధ రంగాల పరిస్థితులను కలెక్టర్ వివరించారు.

సంక్షేమ పథకాలపై ప్రజలలో అవగాహన

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరు సైనికునిలా పనిచేసి పార్టీ విజయానికి పాటు పడాలని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భారీ మెజార్టీని సాధించే దిశగా కార్యాచరణతో అడుగులు వేయాలన్నారు. రాజమహేంద్రవరంలోని సంహిత కన్వెన్షన్ హాలులో రాజానగరం నియోజవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీ సభ్యులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికలలో అనుసరించవలసిన వ్యూహాలపై వారికి రాజా దిశనిర్దేశం చేశారు. స్థానికంగా ఉండే వర్గాలను పక్కన పెట్టి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను, పొందిన ప్రయోజనాలను ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులను కలుసుకుని వివరించాలన్నారు. ఎలాంటి వివక్షత చూపకుండా అన్ని వర్గాలకూ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందన్నారు. అర్హత మాత్రమే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందన్నారు. ఎలాంటి రాజకీయ ప్రమేయాలకూ కూడా తావు లేదన్నారు. తెలుగు దేశం హయాంలో ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. రెండు ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకుని జగనన్నకు మద్దతు పలకాలని ప్రజలకు సూచించాలని క్యాడర్‌కు చెప్పారు. పార్టీకి సంబంధించి సత్వరమే గ్రామకమిటీల నియామకాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. రానున్న ఎన్నికలకు ముందుగానే ప్రచారపర్వంలో అడుగు వేయాలన్నారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు లభిస్తుందనే విషయాన్ని కార్యకర్తలు మరవరాదన్నారు. స్థానికంగా విజయం సాధించాలని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలనే గట్టి సంకల్పంతో పని చేయాలని జక్కంపూడి వైఎస్సార్ సీపీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వర్రావు, నాయకులు అనదాస సాయిరామ్, కొండపల్లి దుర్గారావు, కొండగుంటూరు రాయుడు, నాళం రోశయ్య, చాటమర్తి దుర్గారావు పాల్గొన్నారు.



ద్రాక్షారామ: భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ద్రాక్షారామ: భీమేశ్వరాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



సామర్లకోట: పంచారామ క్షేత్రంలో భీమేశ్వరునికి వేకువన తొలి పూజను తిలకించడానికి తరలి వచ్చిన భక్తులు



సామర్లకోట: భీమేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

తొలి వారం.. భక్తజన సాగరం

పవిత్ర కార్తికం.. అందునా కైలాసనాథుడైన ఆ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం.. అది కూడా ఈ మాసంలో మొట్టమొదటిది కావడంతో శివాలయాలు భక్తజన సాగరాలే అయ్యాయి. పావన గోదావరి పాయలు.. ఆ నదీ కాలువలు.. ఆలయ పుష్కరిణులు.. ఇతర నదీతీరాల్లో వేలాదిగా భక్తులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి.. ఆ ముక్కంటిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్షబిల్వార్చనలు, ఆవునేతి వత్తులతో దీపారాధనలు ఆచరించారు. తమను చల్లగా కాపాడాలని, శుభాలనొసగాలని వేడుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రాలైన ద్రాక్షారామ, సామర్లకోట, పిఠాపురం పాదగయ, మురమళ్ల తదితర ఆలయాలకు వేలాదిగా భక్తులు పోటెత్తారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

– రామచంద్రపురం రూరల్/సామర్లకోట/పిఠాపురం/ ఐ.పోలవరం/కొత్తపేట/రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరం: పుష్కరాల రేవు వద్ద గోదావరి పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు. (అంతర చిత్రం) గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు



మురమళ్ల: భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితుడు



కొత్తపేట: పలివెల కొప్పేశ్వరస్వామి వారికి అర్చకుల అభిషేకం

ఈ మేక ధర.. కేకో కేక



ఒళ్లంతా విపరీతంగా పెరిగిపోయిన ఊలుతో కనిపిస్తున్న దీనిని పొట్టేలు అనుకునేరు! ఇదో మేక.. అలాగని ఇది ఆషామాషీ మేక కాదు.. దీని రేటు వింటే కళ్లు తేలవేయడం ఖాయం. మామూలుగా మన దేశవాళీ మేక ఖరీదు మహా అయితే ఓ ఇరవై వేల రూపాయలుంటుంది. కానీ ఈ మేక రేటు ఏకంగా ఒకటిన్నర లక్షలు. 'చిగు' జాతికి చెందిన ఈ మేకలు హిమాలయ పర్వత ప్రదేశాల్లో ఉత్తర ప్రదేశ్‌కు ఉత్తరంగా, హిమాచల్ ప్రదేశ్‌కు ఈశాన్యంగా లభిస్తుంటాయి. ఎక్కువగా తెలుపు రంగులో, వంపులు తిరిగిన పెద్ద పెద్ద కొమ్ములు కలిగి, సుమారు 50 కేజీల బరువు ఉంటాయి. హిమాలయాల్లో చలి ఎక్కువగా ఉండటంతో వీటి శరీరంపై ఊలు చాలా పొడవుగా పెరుగుతుంది. దీనిని శాలువాల తయారీకి వినియోగిస్తారు. అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన అడబాల వెంకటేశ్వరరావుకు పశు పోషణ అంటే ఎంతో ఇష్టం. పుంగనూరు ఆవులు, గిత్తలు, విభిన్నంగా ఉండే మేకలు, చెవుల పిల్లుల వంటి వాటిని పెంచుతూ కొన్నాళ్ల తర్వాత లాభానికి విక్రయిస్తుంటారు. ఆయన ఈ మేకను నేపాల్‌లో రూ.1.50 లక్షలకు కొనుగోలు చేశాడు. మాచవరంలో జరిగిన పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గాలి గోపురం, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వెంకటేశ్వరరావు వద్ద ఉన్న పుంగనూరు ఆవు, దూడను తీసుకువచ్చారు. వీటితో పాటు ఆయన ఈ 'చిగు' జాతి మేకను కూడా అక్కడకు తీసుకువచ్చారు. వింతగా ఉన్న ఈ మేకను పలువురు ఆసక్తిగా తిలకించారు.

– అంబాజీపేట



పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పిఠాపురం: పాదగయ క్షేత్రం పుష్కరిణిలో భక్తుల సందడి



పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి అర్చకుల అభిషేకాలు

సత్యదేవుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- క్యూ కంపార్ట్‌మెంట్ల స్థానంలో మళ్లీ క్యూ లైన్లు
- పశ్చిమ రాజగోపురం వద్దకే దేవస్థానం బస్సులు
- విశ్రాంతి మండపం ముందు భాగంలో వ్రతాలు, ప్రసాదం కౌంటర్లు
- నూతన ఈఓ రామచంద్ర మోహన్ చర్యలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అన్నవరం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి (ఈఓ) కె.రామచంద్ర మోహన్ సోమవారం చర్యలు చేపట్టారు. సత్యదేవుని దర్శనానికి ఆదివారం వచ్చిన భక్తులు క్యూ కంపార్ట్‌మెంట్లలో చాలా ఇబ్బందులు పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆ కంపార్ట్‌మెంట్లను తాత్కాలికంగా మూసివేశారు. వాటి పక్కనే ఉన్న క్యూ లైన్ల ద్వారా దర్శనానికి వెళ్లే విధానాన్ని పునరుద్ధరించారు. దీంతో సోమవారం ఎటువంటి తొక్కిసలాట లేకుండానే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

- ఇప్పటి వరకూ భక్తుల వాహనాలను సత్యగిరి జంక్షన్‌లో నిలుపు చేసి భక్తులను దించి, వాహనాలను నేరుగా సత్యగిరిపై పార్కింగ్ స్థలానికి పంపించేవారు. దీనివలన సత్యగిరి జంక్షన్ నుంచి భక్తులు ఆలయానికి నడిచి రావాల్సి వచ్చేది. దేవస్థానం బస్సులు, దేవస్థానం నడుపుతున్న ఉచిత టాటా మ్యాజిక్ వాహనాల్లో కూడా వై.జంక్షన్ వరకూ మాత్రమే భక్తులను తీసుకుని వచ్చేవారు. దీనివలన భక్తులు ఇబ్బంది పడుతున్నారని ఈఓ రామచంద్ర మోహన్ గుర్తించారు. దీంతో దేవస్థానం బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాల్లో భక్తులను నేరుగా పశ్చిమ రాజగోపురం వరకూ తీసుకు రావాలని ఆదేశించారు.
- పశ్చిమ రాజగోపురం ఎదుట విశ్రాంతి షెడ్డు ముందు భాగంలో ప్రసాదం, వ్రతాల కౌంటర్ల ఏర్పాటుకు ఈఓ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ వీటిని షెడ్డు లోపల చివరన ఏర్పాటు చేశారు. భక్తులు అక్కడి వరకూ వెళ్లి, వ్రతాల టిక్కెట్లు, ప్రసాదం కొనుగోలు చేసేందుకు చాలా అవస్థలు పడేవారు. దీంతో వీటిని పశ్చిమ రాజగోపురం ముందు భాగంలో ఏర్పాటు చేయాలని ఈఓ ఆదేశించారు.
- విశ్రాంతి షెడ్డు ముందు భాగంలో మెరకను తొలగించాలని సూచించారు.
- రామాలయం వద్ద విశ్రాంతి షెడ్డు చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించి, అక్కడ గతంలో మాదిరిగానే భక్తులు విశ్రాంతి తీసుకునే వీలు కల్పించారు.



పశ్చిమ రాజగోపురం వద్దకు దేవస్థానం వాహనాల్లో వస్తున్న భక్తులు



కంపార్ట్‌మెంట్లకు బదులు ఏర్పాటు చేసిన క్యూ లైన్లు



రామాలయం వద్ద గల విశ్రాంతి మండపంలో సేద తీరుతున్న భక్తులు

భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం



సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం ఇస్తాం. భక్తులు సులభంగా స్వామివారి వ్రతాలాచరించి, దర్శనం చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు చేశాం. దేవస్థానం వాహనాల్లో భక్తులు నేరుగా పశ్చిమ రాజగోపురం వరకూ చేరుకునే వీలు కల్పించాం. క్యూ లైన్లను పాత పద్ధతిలోనే ఏర్పాటు చేశాం. ఈఓ కార్యాలయం ముందు పార్కింగ్ స్థలంలో గతంలో 20 టాయిలెట్లు ఉండేవి. వాటిని కూల్చేయడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అక్కడ మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 30 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఫెయిలైన ప్రైవేటు విద్యార్థులందరూ జరిమానా లేకుండా ఈ నెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చు. ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్‌వీఎల్ నరసింహం సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు వారి కళాశాలలో ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి ఎంత మంది ఫీజు చెల్లించారు, ఎందరు చెల్లించలేదు, కారణాలేమిటనే వివరాలను తమ కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపించాలని ఆదేశించారు. ఫెయిలైన విద్యార్థులందరితో ఫీజు కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ పాసైన తరువాత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హెచ్‌సీఎల్ టెక్‌బీ సంస్థ అన్ని కళాశాలల్లో అవగాహన కల్పిస్తోందని తెలిపారు. దీనిపై కూడా విద్యార్థులను ప్రిన్సిపాల్స్ ప్రోత్సహించి, ఎక్కువ మంది పేర్లు నమోదు చేయించి, వచ్చే నెలలో జరిగే పరీక్షకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌కు, పరీక్ష రాసేందుకు ఎటువంటి ఫీజు లేదన్నారు. వచ్చే నెలలో పరీక్ష జరిగే తేదీ త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు హెచ్‌సీఎల్ టీమ్ సభ్యుడు సాయికిరణ్‌ను 96429 73350 సెల్ నంబరులో సంప్రదించాలని నరసింహం సూచించారు.

గోల్డెన్ వరల్డ్ కప్



పెద్దాపురం పట్టణానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, బంగారు శిల్పి తాళాబత్తుల సాయి సూక్ష్మ బంగారు వరల్డ్ కప్ తయారు చేశారు. కేవలం రెండు గంటల్లో 0.500 మిల్లీగ్రాముల బంగారంతో ఈ గోల్డెన్ వరల్డ్ కప్‌ను రూపొందించారు. ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో వరుసగా పది మ్యాచ్‌ల్లో అవలీలగా విజయం సాధించి, అభిమానుల మనసును గెలుచుకున్న టీమిండియాకు, ప్రపంచ కప్ గెలుచుకున్న ఆస్ట్రేలియా జట్టుకు అభినందనలు తెలుపుతూ ఈ బంగారు ప్రపంచ కప్ తయారు చేశానని సాయి చెప్పారు.

– పెద్దాపురం



సాయి తయారు చేసిన గోల్డెన్ వరల్డ్ కప్